
# మృత్యువుపై ఘన విజయము

2వ ముద్రణ కొత్తకాపీలతో

**పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజ గారు**




కాపీలకు :-

యమ్.యమ్. చంద్రబాబు

ద్వారకా టెక్స్‌టైల్స్, కచేరి వీధి,

సూళ్ళూరుపేట, నెల్లూరు జిల్లా - 524121

## ఆశయము

పూజ్యశ్రీ మాష్టారుగారు మన మధ్య ఉన్నప్పుడు వారి దివ్యస్థితిని గుర్తించలేకపోయాము. ఈనాడైనా వారు విశ్వచైతన్యముతో ఐక్యమైయున్నారన్న విషయం తెలియజేస్తూ ఆ ఆనందాన్ని మీతో పంచుకోవడమే నా ఆశయము. వారు సిద్ధ పురుషులు గనుక గడపమీద నిలుచున్న మనిషివలె సగుణసాకారంగాను, నిర్గుణ, నిరాకారంగాను రెండు స్థితులలోను ఉండగలరు. ఈ క్రింది భక్తుల అనుభవాలను బట్టి వారు సర్వభూత హృదయాంతర్వర్తియై ఎల్లవేళల మన సర్వ ఆలోచనలు తెలుసుకొని వాటికి తగిన ఫలితాలిస్తున్నారు. పిలిచినప్పుడు పలకడం ఒక గొప్ప విషయం. అంతకంటే గొప్ప విషయం - మన పిలుపుతో నిమిత్తం లేకుండానే మన కష్టాలలో ఆదుకోవడం. ఇది ఈ ప్రేమమూర్తియొక్క ప్రేమకు పరాకాష్టయైన చర్య. ఇంతటి మహనీయమూర్తి బిడ్డలమైన మనమందరము వారికి ఆనందం కలిగించే విధంగా "క్రొత్తవి తగిలించుకోని విధంగా" మన జీవితాలను నడుపుకుందాం. వారు మనకందించిన గ్రంధాలలోని సారము వంటపట్టేటట్లు చేయమని వారిని హృదయపూర్వకంగా ప్రార్థిద్దాం. దున్నపోతుచేత వేదం పలికించిన చైతన్యమూర్తికి సాధ్యంకానిదేదీ లేదుకదా! ఓ సద్గురురాయా ఇవే మా సాష్టాంగ దండప్రణామములు.

## మహా సమాధి అనంతరం భౌతిక దర్శనాలు

శ్రీ బ్రహ్మానందరావుగారు, ధర్మల్ స్టేషన్, వి.టి.పి.యస్., విజయవాడ దగ్గర. ఇలా వ్రాస్తున్నారు.

ఒక మిత్రుని సలహాపై సాయిలీలామృతం కొని అట్టమీద బాబా బొమ్మ చాలా బాగుందనుకొన్నాను. పుస్తకము తెరువగానే మూడవ పేజీలో శ్రీ మాష్టారి ఫోటో చూచి రచయిత ఫోటోకు బదులు బాబా ఫోటో ఉంటే వారికి నమస్కరించి పారాయణ మొదలు పెట్టవచ్చు అనుకున్నాను. వారిని గురించి ఎలాంటి అభిప్రాయమూలేదు. సాయి లీలామృతం పారాయణ వలన నాకు లేకలేక కొమార్తె కల్గింది. మరొక మిత్రుని సలహాపై మహాత్ముల ముద్దు బిడ్డడు చదివాను. ఇప్పుడు వారంటే పుస్తకాలు అమ్మకునేవారన్న భావంపోయి కాస్త గౌరవభావం ఏర్పడింది. కానీ పూజ్యభావం ఏర్పడలేదు. నాకు తెలిసిన మాష్టారు అనే పుస్తకం చదివాక అగౌరవభావం పెరిగింది.



1999 ఏప్రిల్ 12వ తేదిన శ్రీ మాష్టారి ఆరాధనోత్సవానికి వెళ్ళాను. నా మిత్రులంతా పెద్ద పెద్ద ఫోటోలు కొంటుంటే నేను బాబా, మాష్టరుగారు కలిసి ఉన్న చిన్న బ్లాక్ అండ్ వైట్ ఫోటో కొన్నాను. బాబా ప్రక్కన మాష్టరుగారుండడం ఇష్టములేని నేను ఆ ఫోటో కత్తిరించి ఇద్దరినీ వేరు చేశాను. మొత్తం ఏడు ఫోటోలు లామినేషన్ చేయమని ఇస్తే ఆ షాపువాడు రసీదుకూడా ఇచ్చాడు. రెండు రోజుల తర్వాత పోతే ఆ షాపువాడు నేను కత్తిరించి విడదీసిన రెండు ఫోటోలు కలిపి ఒకటిగా లామినేట్ చేశాడు. బాబాకు మాష్టర్‌గారిని విడిచిపెట్టడం ఇష్టంలేదని తలచాను. ఈ ఫోటో పూజా మందిరంలో ఎక్కడ పెట్టాలి? సాయి భగవంతుడే మరి మానవ మాత్రుడైన మాష్టరుగారిని భగవంతునికిచ్చే స్థానంలో కూర్చోబెట్టడం ఇష్టంలేక - పూజా గృహంలోని చిత్ర పటాలకు చివరి ప్రక్కన పెట్టాను.

ఒక రోజు పూజ చేస్తూ మధ్యలో తల ఎత్తిచూచేసరికి దీపారాధన కుంది రోజూ పెట్టే స్థానంలో లేకుండా శ్రీ మాష్టారుగారి చిత్రపటం దగ్గరగా ఉంది. పొరపాటున అక్కడ పెట్టానేమోనని మరలా ఆ దీపారాధన కుంది మామూలు స్థానంలో పెట్టాను. పూజ చేసి నైవేధ్యం పెట్టాలని చూచేసరికి దీపారాధన కుంది తిరిగి శ్రీ మాష్టారి పటం దగ్గరుంది. బాబాగారికి హారతి, నైవేద్యం అయ్యాక ఈ వెలుగుతుండే దీపారాధనకుంది ఇలా కదలడమేమిటి దీని రహస్యం తెలుసుకోవాలని ఆ కుందిని మాష్టరుగారి పటం దగ్గరనుండి తీసి యధాస్థానంలో పెట్టి ప్రక్క రూములోకి వెళ్ళి ఒక్క నిమిషంలో పూజాగృహానికి వచ్చి చూచేసరికి నా కళ్ళను నేను నమ్మలేని విధంగా ఆ దీపారాధన కుంది కదులుతూ, ఆగుతూ, కదిలి మూడంగుళాలదూరం వెళ్ళి మరలా ఆగుతూ అలా నడిచి శ్రీ మాష్టారి పటం దగ్గర ఆగింది. అది మొదలు శ్రీ మాష్టారుగారిని కూడా సాయితో సమానంగా పూజిస్తున్నాను.

శ్రీ సాయి లీలామృతంలో "ఇష్ట దైవం అతనికి సద్గురువును చూపాడు" అన్న వాక్యంమీద నామనస్సు నిలిచి నా ఇష్టదైవం అయిన సాయి నాకు మాష్టరుగారిని సద్గురువుగా చూపారని నాలోని సంశయాలన్నీ పై లీలద్వారా తొలగించారని నమ్మి ఆ సద్గురుమూర్తి చూపిన బాటలో నడుస్తున్నాను.

ఒక భక్తురాలు - దమ్మపేట, ఖమ్మం జిల్లా ఇలా చెపుతున్నారు.

నేను కొన్ని కష్టాలలో ఉండి "మాష్టరుగారూ మీరు నాతో ఉన్నట్లు నిదర్శనముంటే నేనీ కష్టాలన్నింటినీ సంతోషంగా భరించగలను. మీరలాంటి నిదర్శనమివ్వండి " అని కన్నీటితో ప్రార్థించాను. ఆనాటి రాత్రి కూర్చొని ఉన్న పటంలోవలె శ్రీ మాష్టారు తెల్లని పంచ చొక్కాతో దర్శనమిచ్చి నా వీపుమీద రెండుమార్లు గట్టిగా తట్టినారు. ఆ అనుభవం తలచుకుంటే శరీరం గగుర్పొడుస్తుంది. ఇదే విధంగా మరిరెండుమార్లు దర్శనమిచ్చారు. వారు నేటికీ స్మృతిమాత్ర ప్రసన్నులు.

సూళ్ళూరుపేట నుండి పి. రాజాలాల్ ఇలా వ్రాస్తున్నాడు.

గురుబంధు శ్రీ పెసల సుబ్బరామయ్యగార్కి నమస్కారములు. నాకు మాష్టారుగారు భౌతికంగా దర్శనమిచ్చిన సన్నివేశాన్ని మీకు తెలియచేస్తున్నాను.

మొట్టమొదటిసారిగా నేను జనవరి 1989 సం॥లో మరోనంద దీపం పుస్తకములోని మాష్టారుగారి ఫొటో చూడగానే ఆయన రూపం నా మనసులో ముద్రపడింది. కాని మాష్టరుగారిని భౌతికంగా దర్శించాలనుకునేటప్పటికి 1989 ఏప్రియల్ 12వ తేదికి సమాధి చెందారనే విషయం తెలిసి నిర్ఘాంతపోయాను. అప్పటినుంచి మాష్టరుగారి సమాధిని దర్శిస్తూ, వారిని సన్నిహితంగా దర్శించి, సేవించిన వారిని కలుసుకుంటూ వారిద్వారా మానసికంగా మాష్టరుగారికి సన్నిహితం అవుతూవుంటాను. నాకు ఏదైనా సమస్య వస్తే అమ్మగారికి మాష్టారుగారిపేర ఉత్తరం వ్రాస్తే ఆ ఉత్తరం అక్కడకు చేరకముందే నా సమస్యకు పరిష్కారం దొరుకుతూవుండేది. అప్పటినుండి ప్రతి మంగళవారం మా యింటిలో సత్సంగం జరుపుకుంటూ వున్నాము. సత్సంగంలో మహాత్ముల ముద్దుబిడ్డడు, నాకు తెలిసిన మాష్టారు, మరోనందదీపం, మాష్టారుగారి స్మృతులు పారాయణ చేసుకుంటూ వున్నాము. ఈ విధంగా చేసుకుంటూపోతూవున్నా నాలో ఏదో తీరని కొరతవుండేది. అదేమిటంటే మాష్టారుగారిని భౌతికంగా దర్శించలేక పోయాననే బాధ. ఆ కోరికను మాష్టారుగారు సోమవారం 20-11-2000 తేదిన నెరవేర్చారు.



ఆ రోజు రాత్రి మా ఆవిడకు విపరీతమైన కడుపునొప్పి. భరించలేకుండావుంది. నేను బాబాను, మాష్టారుగారిని తలచుకొని విన్నవించాను. నిద్రపట్టలేదు. సుమారు రాత్రి 2 గం॥ల ప్రాంతంలో నేను బయటకు వెళ్ళివచ్చి మంచంపై పడుకుని అలా ప్రక్కకు తిరిగిచూస్తే మేముసత్సంగంచేసే ప్రదేశములో "మాష్టారుగారు" భౌతికంగా దర్శనమిచ్చారు. నేను కళ్ళు నులుముకుని చూచేసరికి ఆయన క్రిందకువంగి పైకిలేస్తున్నారు. క్రొత్త పెద్దంచు పట్టుపంచె, క్రొత్త హాఫ్ ఖద్దరు షర్టు వేసికొనివున్నారు. నేను లేచేసరికి ఆయన అదృశ్యమైనారు. ఆ రూపం యిప్పటికికూడా నా మనస్సులో కన్నుమూసినా, తెరిచినా తలచిన మరుక్షణమే గోచరిస్తుంది.

ఈ విధంగా మాష్టారుగారు నాపై కరుణతో సమాధి అయిన 11 సం॥ల తరువాత భౌతికంగా దర్శనమివ్వడమేకాకుండా, మా ఆవిడకు వెంటనే కడుపునొప్పి తగ్గించి - కరుణామయుడు, ఆపద్బాంధవుడు అనే నామాన్ని సార్థకం చేసుకున్నారు. సాయి - మాష్టారుగారి ఆశీస్సులు నాకు సదాకలగాలని ప్రార్థిస్తూ ....... రాజాలాల్.

## ఆచార్యులవారి అద్భుత స్థితి

ఈ క్రింది లీల జరుగవలెనంటే శ్రీ మాష్టారి స్థితి ఎలాంటిదై ఉండాలో యోచించండి. అంతా తానైనవాడు, సాక్షీభూతుడైనవాడు, నిత్యసత్యుడు, మానవాళి ఎడల చెప్పనలవికాని కరుణగలవాడు, అద్వైతస్థితిలోను ద్వైతస్థితిలోను రెండు స్థితులలోనూ ఉండగలవారికే ఈ దివ్యలీల ప్రసాదించ సాధ్యము.

శ్రీ మాష్టారుగారిని భక్తులు ముద్దుగా మహాత్ముల ముద్దుబిడ్డడన్నారు. కొందరు సాయిబాబా కా బేటా అన్నారు. మరికొందరు సాయి మాష్టర్ అన్నారు. ఇవన్నీ శ్రీ భరద్వాజ మాష్టారిగారి పేర్లు. నిర్వివాదాంశంగా అందరూ వారిని ప్రేమమూర్తి అనేవారు. నేటికీ అంటున్నారు. ఇకముందు అంటారు.

ఆ నాటివరకు నేను భరద్వాజగారు అనేపేరు చెవితో వినడంతప్ప వారి ఫొటోను నేనెప్పుడూ చూడలేదు. మేము ఏడు సంవత్సరములు లైఫ్ ఇన్సూరెన్సు కట్టి ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులవలన కట్టలేక మానేశాను. పాలసీ కాలదోషం పట్టింది. అయ్యో ఇన్నివేల డబ్బు పోయిందే అని మనసులో బాధ. ఏమీ చేయలేని స్థితి నేను షిర్డిసాయి బాబాను పూజించుకొనేదాన్ని. ఒకరోజు రాత్రి

మూడుగంటలప్పుడు శ్రీ మాష్టారు నన్ను నిద్రనుండి తట్టిలేపి ఎందుకమ్మా బాధపడుతావు. రేపు మనిషి వస్తాడు. నీ పాలసీ తిరిగి బ్రతుకుతుంది. ఏమీ బాధవద్దని చెప్పి అదృశ్యమయ్యారు. ఈయనెవరు ఇలా చెప్పాడే. సాయిబాబా ఈ రూపంలో వచ్చాడేమో అని అనుకున్నాను. తెల్లవారి మధ్యహ్నం ఎల్.ఐ.సీ. ఏజంటు వచ్చి "లక్ష్మీ మీ ఎల్.ఐ.సి. పాలసీ బ్రతుకుతుంది. మీకు లోన్ ఇస్తారట. ఆ డబ్బుతో పాలసీ కట్టండి అని చెపుతూ తన సంచిలోనుండి ఏదో ప్రింటెడ్ ఫారం తీసి నాకివ్వబోయాడు. శ్రీ భరద్వాజగారి ఫోటో ఒకటి వారి సంచినుండి క్రిందపడింది. ఆ ఫోటోచూచి "రాత్రి వీరు నాకు స్వప్నదర్శనమిచ్చారు" అని నా దర్శన వృత్తాంతం వారికి చెప్పాను. అప్పుడాయన ఎంతో సంతోషంతో "వీరు మన క్రిష్ణమాచారిగారి సోదరులు. అందరూ వీరిని సాయి మాష్టర్ అంటారు" అని చెప్పారు. ఏ జన్మలో నేను వారిని సేవించానో నా కష్టకాలంలో నాకు దర్శనమివ్వడమేగాక నష్టపోయిన జీవిత భీమా డబ్బు వచ్చేటట్లు చేశారు. ఈ మహనీయునికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను. చెన్నం లక్ష్మి,

గుంటూరు, అరండల్‌పేట, 7వ లైను.

శ్రీమతి ప్రభావతిగారు తిరుపతిలో వాణిజ్యపన్నుల కార్యాలయంలో పనిచేస్తున్నారు. వీరు షిరిడీ వెళ్ళి అక్కడనుండి శని సింగణాపూర్ వెళ్ళారు. అక్కడ రేణుకమ్మ గుడి ప్రక్కన ఏదో ఆశ్రమం ఉంటే వెళ్ళారు. అక్కడ శ్రీ మాష్టరు స్పష్టంగా కూర్చొని యున్నారు. అక్కడ వారి ముందు ముగ్గురు నలుగురు కూర్చొని ఉంటే వారికేదో చెబుతున్నారు. నేను నా స్నేహితులు వెళ్ళగానే శ్రీ మాష్టరు గారు "రామ్మా" అని పిలిచారు. నాకు అలా వినిపించింది. నాతో వచ్చిన వారికి "ఆవోమ్మా" అని అన్నట్లు వినిపించిందని చెపుతున్నారు. నేను 50 రూ. దక్షిణ ఇచ్చాను. అక్కడ కూర్చోగానే అందరికీ బొట్టుపెట్టారు. తరువాత మేము వచ్చేశాము. శ్రీ మాష్టరుగారు బ్లూగళ్ళులుంగీ కట్టుకొని తెల్లహాఫ్‌చొక్కా వేసుకొని ఉన్నారు.

ఇంటికి వచ్చాక శ్రీ మాష్టారి దర్శనం గురించి ఒకే ఆలోచనైంది.

ఆ తర్వాత దత్త ప్రదక్షిణలు చేస్తుంటే ఒక చక్కని స్వప్నం వచ్చింది. అందులో తలుపు వేసి ఉంటే కూడా శ్రీ మాష్టరు గారు చక్కగా ఇంట్లోకి వచ్చేస్తున్నారు. ఇది చూచి నేనెంతో ఆశ్చర్యపడిపోతున్నాను. స్వప్నం అంతరించింది.



శ్రీ డి. నాగేశ్వరరావు, టీచర్ - దమ్మపేట, ఖమ్మ జిల్లా, - ఇలా తెలియజేస్తున్నారు.

6-2-2001 న మా గ్రామంలోని సాయిబాబా మందిర వార్షికోత్సవ దినము. ఐదువేల మందికి అన్న సంతర్పణ చేయాలి. మందిరంలో భజన జరుగుతుంది. మందిరంలో 12 గంllలలోగా నివేదన చేయడం వీలుకాదని మా సత్‌సంగ సభ్యురాలు సోదరి లక్ష్మిగారింటికి పదార్థాలన్నీ తీసుకువెళ్ళి వారినే బాబాకు నివేదన చేయమని నేను నామం చెపుతూ నిలుచున్నాను. అంతవరకే నాకు తెలుసు. ఆ తర్వాత నా కన్నులు మూతపడ్డాయి. నేను మందిరంలో ఉన్నట్లు అనుభూతికల్గుతుంది. శ్రీ భరద్వాజ గురువుగారు గడ్డం, లుంగీలో బాబా నడకతో వేగంగా నావద్దకొచ్చి "పదార్థాలు ఏవి ఏవి" అని అడుగుతున్నారు. అంతలోనే వారికి పెట్టాలనిపించింది. అక్కడంతా ఇసుక ఉంది. ఎక్కడపెట్టాలి ? జనం చాలా రద్దీగా ఉన్నారు. నేను విస్తర తీసుకువెళ్ళి ఒక చోట కూర్చొని నా ఒడిలో విస్తరి వేసి ఇప్పుడు పెట్టండి అని విస్తరి క్రింద చేతులు పెట్టి పట్టుకున్నాను. అన్ని పదార్థాలు వడ్డించారు. నావాడిలోని విస్తరు లో ఉన్న పదార్థాలను శ్రీ భరద్వాజ గురువుగారు త్వరత్వరగా భోంచేసి తన గడ్డానికి అంటుకున్న మెతుకులు కూడా తుడుచుకోకుండా "కానివ్వండి. కానివ్వండి" అని వెళ్ళిపోతున్నారు.

ఇంతలో సోదరి లక్ష్మిగారు నివేదన చేయడం పూర్తిచేసి కొంత ఆహారం కాకబలికి సమర్పించి మిగిలిన పదార్థం అన్నపురాసిలో కలిపేందుకు నావైపు చూచారు. నా కళ్ళు మూతలు పడిఉన్నాయి. కళ్ళ వెంట కన్నీళ్ళ సంతత ధారగా కారుచున్నాయి. ఎందుకు నేనలా ఉన్నానో వారికి తెలియదు. అక్కడున్న బాబు "ఏంటి అంకుల్ ఏడుస్తూ నామం చెపుతున్నాడు" అని అనుకొన్నాడట. సోదరి లక్ష్మి గారు బిగ్గరగా రెండుసార్లు పిలవడంతో నాకు బాహ్య స్మృతి కల్గింది. కాళ్ళలో వణుకు. చాలా సేపు అక్కడనుండి కదలలేక పోయాను. సోదరి లక్ష్మిగారు అడిగితే నాకు జరిగిన అనుభూతి వివరించి చెప్పాను. లక్ష్మిగారు విబూతి తీర్థము ఇచ్చాక కొంత తేరుకొని ప్రసాదం అన్నపురాసిలో కలిపేందుకు వెళ్ళగలిగాను.

శ్రీ మాస్టారుగారు నిత్య సత్యులు. వారి నిజస్థితి తెలుసుకునే అవకాశం ఎప్పటికైనా ఇప్పించమని వారిని కన్నీటితో ప్రార్థిస్తున్నాను.

ఈ మహనీయుడు మనపై కరుణతో చెప్పిన మాటలు గుర్తుంచుకొని సాధన కంకితం అవుదాము. నిరంతరము మనము మృత్యువుకు దగ్గరౌతున్నామని గుర్తుంచుకుందాం. క్రొత్తవి తగిలించుకోని విధంగా మనము నడుచుకుందాం. విశ్వరూపుడైన పరమాత్మను అనుక్షణము గుర్తుపెట్టుకుందాం. అన్న పానీయాలకు ఎంత ప్రాముఖ్యతనిస్తామో మహనీయుల చరిత్ర పఠనానికి అంత ప్రాముఖ్యతనిస్తాం. ఆ చరిత్రలలోని విషయాలను హృదయగతం చేసుకొని ఆచరిద్దాం. అలా చేసి మాస్టారికి తగిన బిడ్డలమవుదాం. వారు చెప్పినట్లు జీవితకళను తెలుసుకొని నడుచుకుంటే ఎప్పుడూ ఆనందమే ఆనందం.

నమో శ్రీ భరద్వాజగురవే నమః

కుమారి లక్ష్మీ ప్రభ గారు హైదరాబాద్ వారు తన దివ్యానుభవం ఈ విధంగా వ్రాస్తున్నారు.

శ్రీ మాస్టరు గారిని నేనెప్పుడూ ప్రత్యక్షంగా చూడలేదు. వారి ఫోటో చూడడం మాత్రం జరిగింది. మాస్టరు గారికి లెటర్ వ్రాస్తే వారు సమాధానం వ్రాసేవారు. శ్రీ మాస్టరు గారు మహా సమాధి చెందాక మా యింటికి భౌతికంగా వచ్చారు. సమయం రాత్రి 7గం॥ మాస్టరు గారు తెల్లపంచ, తెల్లచొక్కా వేసుకొని ఫోటోలో ఉండే విధంగా ఉన్నారు. వారితోటి చిన్న అమ్మాయికూడా వచ్చింది. ఆ అమ్మాయి వేదవతిలా ఉంది. వారి ఫ్యామిలీ ఫోటో మా యింట్లో ఉంది. ఇక్కడ మా అమ్మాయి లక్ష్మి ఉండాలని అడుగుతున్నారు. అప్పుడు నేను వీధిలోనే ఉన్నాను. వారిని చూడగానే నాకు మతిపోయి ఏమీ తోచలేదు. కళ్ళవెంట నీళ్ళువచ్చాయి. ఏమీ మాట్లాడలేకపోయాను. మా ఇంట్లో వాళ్ళంతా నన్ను రాజ్ అని పిలుస్తారు.



నా అసలు పేరు లక్ష్మీప్రభ. మాస్టరుగారు నన్ను లక్ష్మి అని పిలుస్తున్నారేమిటి అనుకున్నాను. లెటర్సు వ్రాసేటప్పుడు లక్ష్మీప్రభకి అని వ్రాసేవారు. వారక్కడ ఉండగానే నేను ఇంటిలోపలికి వెళ్ళి మాస్టరు గారు వచ్చారు చూడమని అందరినీ పంపాను. ఇంటిలోని వాళ్ళంతా వారిని చూచారు. కానీ ఎవ్వరూ ఏమీ మాట్లాడలేకపోయారు. మాస్టరు గారు మా ముందే వెళ్ళిపోయారు. కొంచెం సేపు అయ్యాక మాకు తెలివివచ్చి అలాంటి వారెవరైనా మా వీధిలోని ఇతరుల ఇండ్లకొచ్చారా అని అందరినీ అడిగాము. ఆ పోలికలు గల వారెవ్వరూ రాలేదని చెప్పారు. ఇంతకు ముందు మా తల్లి గారికి స్వప్నదర్శనమిచ్చి లక్ష్మీ ప్రభకు నేను పెండ్లిచేస్తాను. మీరేమీ విచారించవద్దని చెప్పారు.

మాష్టరు గారి దయవల్ల నాకు వివాహమైంది. ఒక ఆడపాప కల్గింది. ప్రారబ్ధవశాత్తు కొన్ని సమస్యలు వచ్చాయి. వీటిని గురించి నేను మానసికంగా బాధపడుతున్నాను. నేను పిలువకుండానే పూజ్యశ్రీ మాష్టరు గారు నాకు స్వప్నదర్శనమిచ్చారు. స్వప్నంలో శ్రీ మాష్టరు గారు నా బిడ్డను ఎత్తుకొని యున్నారు. ఈమెకు అన్నీ బాగుంటాయి. చిన్న చిన్నవి వస్తుంటాయి, పోతుంటాయి. వాటిని గురించి నీ వేమీ ఆలోచించవద్దని చెప్పారు.

ఆ కరుణామయునకు ఆ జన్మాంతము ఋణపడియున్నాను.

ఏ జన్మఋణాను బంధమో కాని శ్రీ మాష్టరు గారు వీరి పిలుపుతో నిమిత్తము లేకుండానే స్వప్న దర్శనము, సందేశము ఇవ్వడం ఎంత గొప్ప విషయమో గదా ! మనందరము వారితో అలాంటి అనుబంధము పెంచుకొని తరించాలని ప్రార్థన. ఇందుకు వారిని గురించి, వారి బోధల గురించి నిరంతర చింతనే తగిన మార్గము. అలాంటి అనుబంధం పెంచుకునేందుకు సహాయము చేయమని శ్రీ మాష్టారిని ప్రార్థిద్దాం!

## స్వప్న సందేశాలు

నా మిత్రుని కొమార్తె అత్తగారింటి నుండి ఆ బాధలు పడలేక పుట్టిల్లు చేరింది. ఆమెను తన ఇంట్లో ఉంచుకోకుండా వేరే ఒక ఇల్లుకొనిచ్చి అందులో ఉంచారు. ఆమెకు 5 సం॥ వయసుగల కొమార్తె ఉంది. అట్లాగయినా అల్లుడు కొమార్తె దగ్గరకు వస్తాడేమోనని ఆశ. సంవత్సరాలు గడచిపోతున్నా అదే ఊరిలో నున్న అతడు భార్యా బిడ్డను చూచేందుకైనా ఒక్కసారి కూడా రాలేదు. సరికదా తన భార్యను తన ఇంటికి రమ్మని అనేక సార్లు ఫోను చేస్తాడు. ఈ పరిస్థితిలో నా మిత్రుడు, మిత్రుని భార్య వీళ్ళ కొమార్తె గొలగమూడి, షిరిడీ, ఒంగోలులోని శ్రీ మాష్టరు గారి సమాధి దర్శించి విన్నవించుకున్నారు. నిత్య పారాయణలు చేస్తున్నా ఫలితం లేదు. ఈ సమస్యతో సతమతమయ్యే వీళ్ళు షిరిడీలో ఒక వారం ముగ్గురూ దీక్షచేసి ముగ్గురికీ ఒకే సందేశమివ్వమని ప్రార్థించారు. శ్రీ సాయినాధుడు పలకలేదు. నిత్యం గుంటూరు నల్లమస్తాన్ గారి దర్గాదగ్గర ప్రదక్షిణలు పారాయణ చేస్తూ కుమిలిపోతున్నారు.

ఒకనాటి స్వప్నంలో నా మిత్రుని భార్యకు శ్రీ మాష్టరు గారు కనిపించి "ఆయన ఏమి చేయదలచాడో బాగా ఆలోచించు" అని చెప్పి అదృశ్యమయ్యారు. ఆమె ఏమీ ఆలోచించే స్థితిలో లేదు. అనతి కాలంలోనే అల్లుడు, కుమార్తె రాజీపడి చక్కగా కాపురం చేసుకోసాగారు.

ఇందులో మనం గమనించదగినవి రెండు. మొదటి విషయం - ఆమె గారి పిలుపుతో నిమిత్తం లేకుండా ఎలాంటి దీక్షలు లేకుండా కేవలం పారాయణ ప్రదక్షిణలకే సంప్రీతుడై వారికి దర్శనమిచ్చి సందేశమివ్వడం. రెండవది - శ్రీ నల్లమస్తాన్ దర్గాకు ప్రదక్షిణలు చేస్తుంటే శ్రీ మాస్టారు దర్శనమివ్వడం. ఎవరికి ప్రదక్షిణలు చేసినా, పారాయణ ఏచరిత్ర చేసినా అదంతా భగవంతునకు చెందుతుంది. అన్ని రూపాలూ ఆ భగవంతునవే అని బోధిస్తున్నారు. మూడవ విషయం - వారెంత గొప్ప నిగర్వులో గురుభక్తులో చూడండి. అద్వైత స్థితినందిన ఆ మహనీయుడు నేను చేస్తాను అని చెప్పకుండా "ఆయన ఏమి చేయదలచారో బాగా ఆలోచించు" అని చెపుతూ ఆ గొప్పతన మంతా తన గురువుగారైన సాయినాధునకు అంటగట్టారు. ఈ నాటి కలియుగ కాషాయాంబరధారులైన కలుషిత గురువులీఒక్క విషయం గుర్తుంచుకొని ఆచరించినా పైమెట్టు ఎక్కగలరు. కానీ అజ్ఞానం ఎంత గొప్పగా మాయను వరిస్తుందో గదా !



వెంకటగిరి నివాసి జి. గోపాల్ ఇలా చెబుతున్నాడు :

మా ఇంటిలోని ఆర్థిక ఇబ్బందులు, ఇతరత్రా అనేక పరిష్కరించ వీలుగాని సమస్యలతో, సతమతమవుతున్నాను. ఇవిగాక నా చదువు 2వ సం॥ "లా" అయిపోయింది. 3వ సం॥ జరుగవలసిఉంది. అది జరుగలేదు. మా నాన్నగారి ప్రవర్తన మా అన్నగారి ప్రవర్తన నన్ను బాధపెడుతున్నాయి. నా బాధను చిత్రపటంలోని శ్రీ సాయికి చెప్పుకున్నాను. ఆనాటి రాత్రి నా స్వప్నంలో శ్రీ మాష్టారుగారు కనిపించారు. "గోపాల్ ఆ బిల్డింగు చూడు ఎంత అందంగా ఉందో ?" అన్నారు. "అవును సార్ చాలా బాగుంది అన్నాను.

మాష్టారు :- దానిమీద పిడుగుపడి ధ్వంసమైతే నీ కెట్లా ఉంటుంది.

నేను :- అది ధ్వంసమైతే నాకేంబాధ ఉంటుందిసార్ నాకేమీ ఉండదు.

మాష్టారు :- ఆ ఇంటి యజమానికి చాలా బాధగా ఉంటుందిగదా మరి నీకెందుకు బాధలేదు? నీకు ఆ ఇంటి ఎడల నాదికాదు అనే భావన. డి-టాచ్మెంట్ ఉంది గనుక బాధలేదు. యజమానికి అటాచ్మెంట్ ఉంది గనుక బాధ ఉంటుంది. ఆ బిల్డింగ్‌పై నీ భావన (నాదికాదు అనే భావం) ఎలావుందో అలా ఈ ప్రపంచంలోని సుఖ, దుఃఖాల ఎడల నీ భావాన్ని నిల్పుకో. తల్లి గర్భంలోనుండి వచ్చేటప్పుడు ఎవ్వరూ ఏమీ తెచ్చేదిలేదు. వెళ్ళేటప్పుడు తీసుకుపొయ్యేదిలేదు. ఈ సిరి సంపదలన్నీ మనో కల్పితాలు. గనుక నీవు ప్రపంచం ఎడల డి-టాచ్మెంట్ కలిగి ఉంటే నీకు దుఃఖము ఉండదు అని అదృశ్యమయ్యారు. ఈ లీలద్వారా శ్రీ మాష్టారుగారు స్మృతిమాత్ర ప్రసన్నులని సర్వవ్యాపకులని తెలుస్తుంది.

ఓ. రఘురామరాజు గారు, టీచర్, యం.పి. ఎలిమెంటరీ స్కూల్, గాంధి పాళెం, ఉదయగిరి మండలం, నెల్లూరు జిల్లా - ఇలా వ్రాస్తున్నారు.

నేను శ్రీ మాష్టరు గారి దగ్గర విద్యానగర్‌లో బి.ఏ., చదివాను. వారంటే నాకెంతో అభిమానము పూజ్యభావము. మా రెండవ పాప పుట్టినప్పుడు ఆ అమ్మాయికి ఏమి పేరు పెట్టాలని ఆలోచిస్తున్నాను. శ్రీ మాష్టరు గారిని నేను పిలవకుండానే నాకు స్వప్న దర్శనమనుగ్రహించారు. "దాక్షాయణి" అని ఆ పాపకు పేరు పెట్టమన్నారు. సార్! ఇది లక్ష్మి సహస్రనామాలలో ఉన్నదా అని ఆ స్వప్నంలో వారిని అడిగాను. "ఉంది. చూసుకో" అన్నారు. తెల్లవారి చూస్తే లక్ష్మి సహస్రనామాలలో ఆ పేరు ఉంది. శ్రీ మాష్టరు గారికి నా మీద ఎంత ప్రేమోచూడండి.నేను పిలవకుండానే నా ఆలోచనలను తెలుసుకొని నాకు సలహా యిచ్చారు. వారిలా నా ఆలోచనలు తెలుసుకోవాలంటే వారు నా ఆత్మలో ఉండి ఉండాలి గదా. నా ఆత్మలో ఉన్నారంటే సర్వజీవుల ఆత్మలలోను ఉన్నట్లే గదా ? సద్గురువంటే వీరేనని మనందరికీ ఈ లీల ద్వారా తెలుపుతున్నారు.

భౌతిక దర్శనాలు, స్వప్న దర్శనాలే కాకుండా అంతటా నిండియున్న చైతన్యమే తానై తనను నమ్ముకున్న భక్తులనెలా రక్షిస్తున్నారో తెలిపేదే ఈ చిత్రమైన లీల. డి. శారద గారు, దమ్మపేట, ఖమ్మం జిల్లా - ఇలా వ్రాస్తున్నారు. 1999 అక్టోబరు 30వ తేది శ్రీ భరద్వాజ మాష్టరు గారి జన్మదిన సందర్భముగా మా గ్రామ సాయిబాబా మందిరంలో ఉదయం పదిగంటలకు సామూహికంగా అందరము కలసి పూజ చేసుకోవాలి. నేను ఆ పూజకు వెళ్లాలని ఇంట్లోపని పూర్తిచేసి దొడ్డి తలుపు గడియవేసి, బయటి తలుపు తాళంవేసి పూజకు వెళ్ళాను. 12-30 ని॥లకు హారతి అయ్యాక ఇంటికి వచ్చాను. తాళంతీసి ఇంట్లోకి వెళ్ళేసరికి ఇంటి నిండా రక్తపు చుక్కలు, బీరువా తీసి ఉంది. బీరువా హాండిల్ నుండి క్రింది వరకు రక్తం కారిఉంది. బీరువా డ్రాయరు సొరుగు తాళం తీసివుంది. సొరుగు లోపల బయట రక్తం కారి ఉంది. ఇంట్లో దేవుని గదిలోకి వెళ్ళే మార్గమంతా రక్తపు చుక్కలే ఉన్నాయి. అంటే నేను గుడికి వెళ్ళక ముందే ఎవరో మా ఇంట్లో చేరి కనబడకుండా దాగిఉన్నాడని అర్థమయింది. దొడ్డి తలుపు ద్వారా బయటకు వెళ్ళిపోయాడు. బీరువాలో నగలున్నాయి. డ్రాయరులో డబ్బుఉంది. దేవునింట్లో వెండి దీపపు కుందులున్నాయి. ఏ ఒక్కటిగానీ పోలేదు. ఆ వచ్చిన వానికి శ్రీ మాష్టరు గారు ఎలాంటి శిక్షవేశారో తెలియదు. అతనికి పెద్దగాయం తగిలిందని రక్తపు మరకల వలన తెలుస్తుంది. నా సేవలో ఉన్న వారి సర్వ బాధ్యతలూ నేను చూసుకుంటాను అన్నమాట అక్షరాల సత్యమైంది. ఏమిచేసినా వారి ఋణం తీర్చుకోలేము. వారు చెప్పిన దివ్యమార్గంలో నడిచి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉండే బుద్ధిని ఇమ్మని శ్రీ మాష్టారిని కన్నీటితో వేడుకొంటున్నాను.



మనకు రాబోయే కష్టాలను మహనీయులు మనకు ముందుగా తెలిపి - కొంత వరకు కష్టాలను తగ్గించి మనకు భక్తి విశ్వాసాలు అభివృద్ధి అయ్యేటట్లు చేయడం ఒక గొప్ప విశేషము. చిరంజీవి జి. సాయి సుబ్రహ్మణ్యం, దమ్మపేట, ఖమ్మంజిల్లా వారు తన దివ్యానుభవం ఇలా వ్రాస్తున్నారు. హైదరాబాద్ నుండి దమ్మపేట వస్తూ మధ్యలో బస్సు మారేందుకు ఒక బస్టాండులో 1 1/2 గం॥ ఉండవలసివచ్చింది. ఆ వ్యవధిలో నిద్రపట్టింది. ఒక దివ్యస్వప్నం వచ్చింది. అందులో శ్రీ భరద్వాజ మాష్టరు గారు ఒక మంచంమీద కూర్చొనియున్నారు. సాయివెళ్ళి పాదాభివందనం చేయగానే వీరి వీపు, తల నిమిరి ఆశీర్వదించారు. అంతలో మాష్టరు గారికి వాంతి అయ్యేటట్లు ఏవో ఆహార పదార్థాలు నోటిలోనికి వచ్చాయి. కానీ ఎవరో ఒక మాతృమూర్తి వారి పాదాలకు నమస్కరించుకోవటానికి ఆత్రంగా వచ్చింది. ఆమె నమస్కరించుకునే వరకు అక్కడనే ఉండి తర్వాత వారు ప్రక్కరూములోని వాష్ బేసిన్‌లో వాంతిచేసుకొని వచ్చారు. కల మెలుకువ వచ్చింది. మహాత్ములంటే ఇంతే కాబోలు. వారు అందరి అవసరాలను కృపతో తీర్చేవరకు వారు తమ గురించి పట్టించుకోరని తెలుసుకొన్నాను. ఆ తర్వాత ఇంటికి వెళ్ళి చివటం వెళ్ళివచ్చాను. ఆ తర్వాత నాకు పచ్చకామెర్లు వచ్చాయి. ఇరవై రోజులు, పత్యాలు వైద్యాలు అయ్యాక రోగం తగ్గింది. శెలవులు అయిపోవడంతో హైద్రాబాద్ వెళ్ళాను. అక్కడ తిరిగి జ్వరం కడుపునొప్పి, తలనొప్పి ఎక్కువ కావడంతో ఆస్పత్రిలో చేర్చారు. ఏమితిన్నా, త్రాగినా వాంతయిపోతుంది. మరలా పరీక్షలన్నీ చేసి కామెర్లు, మలేరియా ఉందని తేల్చారు. ఆస్పత్రి మార్చారు. సెలైన్‌లు, గ్లూకోస్‌లు ఎక్కించారు. కానీ ఏమి తిన్నా త్రాగినా వాంతయిపోతుంది. కొంచెం వ్యాధి తగ్గినా వాంతులు ఆగలేదు. కొన్నాళ్ళకు క్రమంగా అన్ని తగ్గి ఆరోగ్యం చేకూరి ఆస్పత్రి నుండి బయటికొచ్చాను.

నాకు ఈ అనారోగ్యం వస్తుందని శ్రీ మాష్టరు గారికి ముందే తెలిసి ఉన్నందున నా స్వప్నంలో వారికి వాంతి అయినట్లు చూపారు. వారు నా బాధను స్వీకరించి ఉన్నందుననే నేను త్వరగా కోలుకున్నాను. ఈ అనుభవం తర్వాత శ్రీ మాష్టారిపై ఎనలేని విశ్వాసము ప్రేమ నాలో చోటు చేసుకున్నాయి. ఆ నాటి స్వప్నం వలన నన్ను రాబోయే అనారోగ్యానికి తట్టుకునే మనోధైర్య మిచ్చి అనుగ్రహించారు. జన్మ జన్మలకు వారికి నేను ఋణగ్రస్తుడనే.

అర్. గోపాల్ - కలిచేడు, నెల్లూరు జిల్లా వారు తన దివ్యమైన స్వప్నానుభవం ఇలా చెబుతున్నాడు. జనవరి 2001 లో ఒకరాత్రి స్వప్నమొచ్చింది. అందులో శ్రీ మాష్టరు మరియు అమ్మగారు కనిపించారు. శ్రీ మాష్టారు సమాధి చెందాక తిరిగి కనిపించారు అనేది స్వప్నంలో తెలుస్తూనే ఉంది. వారి పాదాలు చేతులు స్పృశించి చూస్తున్నాను. వారు మన మధ్య ఉండగా ఎలా ఉండేదో ఆ స్పర్శ అలాగే ఇప్పడు కూడా ఉంది. నేనెంతో ఆశ్చర్యం తో ఉక్కిరిబిక్కిరి అవుతూ మాట్లాడలేకున్నాను. చిన్నగా అందులో నుండి తేరుకొని " సార్ మీకెంతో మంది శిష్యులున్నారు కదా ? వారిలో ఉత్తముడెవరు? అని అడిగాను. అందుకు వారు నోటితో ఏమీ చెప్పకుండా తన చేతిని అమ్మగారి వైపుచూపించారు. నేనింకా ఆశ్చర్యంలో మునిగి ఏదో ఆలోచిస్తుంటే శ్రీ మాష్టరు గారు అదృశ్యమయ్యారు. స్వప్నం అంతరించింది. స్వప్నం నుండి మెలుకువవచ్చినా నాఆశ్చర్యం,పారవస్యం తగ్గలేదు. ఈ పారవస్యం కొన్నాళ్ళవరకు అలా ఉండిపోయింది. ఓం నమో గురుభరద్వాజాయనమః

శ్రీ మాష్టారు ఎప్పుడు కలిచేడు వచ్చినా ఈ గోపాల్ గారు రెండు లీటర్ల పూలు తెచ్చి వారి శిరస్సుపై కుమ్మరించి ఆనందించేవాడు. ఆ పుష్పాలన్నీ ముత్తైదువులందరికీ ఇచ్చేవాడు.

శ్రీ మాష్టారు గారు తన అనుయాయులలో శ్రీ అమ్మగారికి ఉత్తమురాలు అనే స్థానమివ్వడం ఎంతో గొప్పగా తగియున్నది. బాబా గారిపై ఆ తల్లికున్న విశ్వాసానికి అంతేలేదు. వారంటారు గదా నేను వారి బిడ్డననే మాట నిజమే అయితే నాకేమి కావాలో, ఏమి ఇవ్వాలో బాబా గారికి చక్కగాతెలుసు. నా ఆరోగ్యం చక్కబరచమని మాత్రం నేను వారిని అడగనంటే అడగను అంటున్నారు. గత ఇరవై సంవత్సరములనుండి నడువలేక అన్నీ మంచంలోనే జరుపుకుంటూ, నిరంతరం కాళ్ళనొప్పులతో బాధపడే ఈ మహాతల్లి అలా అన్నారంటే ఆమెగారి విశ్వాసమేమని చెప్పగలం. అందుకే శ్రీ మాష్టారు గారు వారికా ఉత్తమోత్తమస్థానమిచ్చారు.



మాష్టారు గారు భౌతికంగా ఉన్నప్పుడు ప్రత్యక్షంగానేగాక స్వప్న దర్శనాల ద్వారా సందేశాలు ఇచ్చేవారని తెలిసిందే. 15-10-2000 తేదిన కలిగిన స్వప్నం మాష్టారుగారు భౌతికంగా లేకపోయినా వారు మనల్ని - మనలో కలిగే స్వల్పమైన ఆలోచనల్నిసైతం గుర్తిస్తూవుంటారని తెలుస్తుంది. నాన్ కార్డియాక్ ఛెస్ట్ పెయిన్ తో 4 రోజులు బాధపడి పగటిపూట ఘాడంగా నిద్రపోతున్నాను. ఒక కల, ఆ కలలో గట్టు గ్రామంలో వున్న సిద్ధపురుషులు శ్రీ మునిరామయ్యస్వామి ఒక కుటీరంలో వున్నారు. నేను ఆయనకి నమస్కారం చేసుకోగానే తలలో ఒక భాగాన్ని గట్టిగా అదిమారు. అప్పుడు కొన్ని మార్పులు అవరోహణ క్రమంలో జరిగాయి. ఆ నొప్పికి మెళకువ వచ్చింది. ఆ నొప్పి ఆ తరువాత కూడా ఉండినది. ఆ స్వప్నం గుర్తుకు వచ్చినప్పుడల్లా ఇలా జరుగకూడదే అని ఆలోచించేవాడిని. ఒక వారం తరువాత ఒక యోగ గ్రంధం చదవడంద్వారా యోగులు అలా చేస్తారని ఉంది. కాని అవరోహణ క్రమంలో జరిగిందే అన్న బాధ ఉండేది. ఆ తర్వాత రోజు కలలో మాష్టారుగారు కన్పించారు, నమస్కరించుకోగానే జుట్టు పట్టుకుని నన్ను లాక్కుపోయారు. నేను ప్రతిఘటించాను. కొంతదూరం పోయిన తరువాత మాష్టారుగారు ఎందుకు అలా చేస్తున్నారో అర్థమై ఆయనకు సహకరించాను. అలా లాక్కుపోతూనే మాష్టారుగారు అడిగారు. "శీర్షాశనం తెలుసుకదా, వేయి, అప్పుడు మీరు వద్దన్నారు కదా ? అనగానే ఇప్పుడు వెయ్యి, గోడకు అనుకుని కాకుండా గోడ మూలగా వేయి" అని అన్నారు. అంతటితో స్వప్నం అంతమైంది. సాధనాపరమైన అవరోధాల్ని తెలుసుకునే సామర్థ్యం మనలాంటి వారికి అసలే లేదు. కాని మాష్టారుగారు నాలో జరిగిన అవరోధాన్ని నవరించారంటే నాకొక నత్యం అర్థమవుతున్నది. అంతటా నిండి అన్ని జీవులలో వున్న చైతన్యమే మాష్టారుగారు అన్న నిజం రూఢి అవుతున్నది.

మనం చేసేది ఎవరికి తెలిసినా, తెలియకున్నా మనకు తెలుస్తుంది. అలా అన్నీ తెలుసుకునే చైతన్యమే - సాయి మాష్టారుగారు.

హరిబాబు - గూడురు.

పూజ్యులైన ఆచార్య భరద్వాజ మాష్టారుగారు సమాధి చెందిన అనంతరము గూడా సాయినాధుని ఆశ్రయించిన భక్తులకు కూడా తమ దర్శన ఆశీస్సులు ప్రసాదిస్తున్నారు. కారణం అంతా ఒక్కటే అయిన చైతన్యం తామే కనుక.

ఇది శ్రీ కాళహస్తిలోని శేఖర్ అను సత్సంగ సభ్యునికి కలిగిన అనుభవం. ఈ అబ్బాయి చాలా కాలంగా దుస్సాంగత్యం, దురలవాట్లవల్ల, చెడు సహవాసం వల్ల తన జీవితాన్ని, ఆరోగ్యాన్ని చేతులారా పాడు చేసుకున్నాడు. కానీ ఈ మధ్య తన మార్గము ద్వారా ఆరోగ్య పరిస్థితి విషమించి కాలేయము, గుండె జబ్బులతో మద్రాసు విజయ హాస్పిటల్‌లో చాలా ధనవ్యయం కూడా జరిగింది. కానీ సాయి-మాష్టారుల కృపతో మరలా సత్సంగాలకు హాజరు కావడం, పారాయణలు చేయడం నిత్య కార్యక్రమంగా మారింది. తత్ఫలితంగా మాష్టారుగారు ఒక రోజు రాత్రి దివ్యమైన స్వప్న దర్శనానుభవాన్ని ప్రసాదించారు.

స్వప్నంలో మాష్టారుగారు 6 సం॥ల నుంచి పిల్లవాడులాగా కనిపించి ఎదుగుతూ వివిధ వయస్సులలో కనిపించి మనకు మామూలుగా దర్శనమిచ్చే రూపం కాలుమీద కాలువేసుకొని కనిపించి నీకేమి కావాలి అని అడిగారట. అతను నాకేమీ వద్దని చెబితే మరెందుకు పిలిచావు అన్నారు మాష్టారుగారు. నాకు బాబాధ్యానం సరిగా కుదరటంలేదు. అలా కుదిరేలాగా చేయమని అడిగారట. దానికి మాష్టారుగారు సరే! కుదురుతుందిలే పొమ్మన్నారట.

మరలా మాష్టారుగారు ప్రసాదించిన స్వప్న దర్శనాన్ని మీరు నాకు కనిపించింది. నిజమని నేను నమ్మేది ఎలా అని అడిగితే నేను వి.సి. వెంకటేశ్వర్లుకు (పుత్తూరు) ఇచ్చిన అనుభవం ఎప్పుడూ సత్సంగాలలో ప్రస్తావించని విషయం ఒకటుంది దానిగూర్చి అడగమన్నారు: అది ఏమిటనగా వి.సి. వెంకటేశ్వర్లుగారు, వారి ధర్మపత్ని ఇద్దరు మాష్టారుగారిని, అమ్మగారిని దర్శించుకున్నప్పుడు ఒక వలవని కొబ్బరికాయ వెంకటేశ్వర్లుగారికి ఇచ్చారట. ఇది వి.సి. వెంకటేశ్వర్లుగారికి చెప్పి సరిచూచుకోమన్నారు. ఈ విషయం మరునటిరోజు సత్సంగంలో అడిగితే అది నిజమేనని వెంకటేశ్వర్లుగారు చెప్పారు. మాష్టారుగారు సమాధి చెదిన్పటికీ తమ లీలలలో, వాక్కులో సందేశంలో ఎటువంటి పొరబాటు వుండదు.

శేఖర్ - శ్రీ కాళహస్తి



బాలిరెడ్డి పాలెం - ప్రకాశరావు గారు -హైస్కూలు హెడ్మాష్టరుగా రిటైరయి...రు. పంతొమ్మిది సంవత్సరాల క్రిందట జరిగిన విషయం ఇలా వివరిస్తున్నారు. శ్రీ మాష్టారిగారిని వారింటికిరమ్మని అంటూఉండేవారట. ఒకసారి ప్రకాశరావుగార్కి శ్రీ మాష్టారుగారు ఇచ్చిన అనుభూతి:-

ఒక బేస్తవారం వారి అమ్మగారు రొట్టెలు చేసినారట. బాబా వద్దపాటలుపాడినారట, కొంచెంసేపు తర్వాత టైము రాత్రి 8గంటలు, అపుడు మాష్టారువారింటికి వచ్చినారట. బాబా పటంవద్ద కూర్చున్నారట. బాబాను చూస్తూ కూర్చున్నారు. కొద్దిసేపు తర్వాత ప్రసాదమేది అంటే వాళ్ళ అమ్మగారు వాళ్ళు (ఇంటిపనివారు) సర్వ్ చేసారు. తర్వాత కొద్ది సేపయ్యాక మాష్టారు ఇక వెడతానని వాకిట్లోకి వచ్చినారు. ప్రకాశరావుగారు మాష్టారిని ఎట్లా పంపాలా ఏమి వేహికిల్ లేదు, బస్ ఈ టైమ్ లో లేదు అనుకుంటూ నేను కూడా వస్తాను మీతో అన్నారు. మాష్టారు వెనక్కి తిరిగి నువ్వు రావద్దు. ఇక 'పో' అన్నారట. అంతే ఆయన మాష్టారి మాట ప్రకారం ఆగిపోయి వెనక్కి తిరిగి ఇంటికి వచ్చేశారు. 11 గం॥ అయ్యింది టైమ్ అని ఆయన ఇంటికివచ్చి లేటయ్యిపోయిందన్నట్లు ఏదీటిఫిన్ పెట్టమన్నారట.వాళ్ళమ్మగారు ఏమిటి 8 గంటలకే టిఫిన్ ఏమిటి, ఇంకా రొట్టెలు చేస్తున్నాను అన్నారట. టైమ్ చూస్తే 8 గంటల 15 నిమిషములు. 15 నిమిషాలలో ఈ అనుభూతి అంతా జరిగింది. వారికి రాత్రి అంతా అయ్యో మాష్టారు నడిచి చీకటిలో 7,8 కిలోమీటర్లు వంటరిగా ఎట్లా వెళ్ళారో అని మర్నాడు ఉదయం విద్యానగర్ మాష్టారింటికి బస్‌లో వెళ్ళారు. అచట "మాష్టారు" ఊర్లోలేరు. నార్త్ ఇండియ వెళ్ళి వారమయింది. విద్యానగర్‌లో

లేరని చెప్పినారట. ఈ సంఘటన గురించి మాష్టారు నార్త్ ఇండియా నుండి వచ్చాక చెప్పారా అంటే చెప్పి ఉంటాను కానీ ఆ వివరాలు గుర్తులేదు అంటారు శ్రీ ప్రకాశరావు గారు.

ఇలాంటి దివ్య లీలలు శ్రీ మాష్టారు మన మధ్య ఉన్నపుడే చూపారు. వారి దివ్య సంకల్పానుసారము అవి ఇతరులకు ఎక్కువగా తెలియవు. ఎవరో ఒకరిద్దరు ముఖ్య స్నేహితులకే తెలిసి ఉండేవి.

ప్రకాశరావు గారికి శ్రీ మాష్టారు వద్ద జరిగిన దివ్యానుభవము:

ఒకసారిప్రరాశరావు గారు మాష్టారు వారికి ఏదైనా పని చెప్పితే బాగుండునని మనసులో బాగా అనిపించిందట, మర్నాడు మాష్టారు వద్దకు విద్యానగర్ వెళ్ళితే మాష్టారు వారితో కోటలో నాస్తిక చర్చల సమావేశానికి వెళ్ళాలి. నన్ను తీసుకునివెళ్ళాలి అన్నారు. వారు ఉత్సాహంగా సరేనని మర్నాడు సైకిల్ మీద మాష్టారిని కూర్చో పెట్టుకుని బయలుదేరినారు. మాష్టారు చాలా బరువుగా అనిపించి వారెంత బలం ఉపయోగించినా సైకిల్ త్రొక్క లేక పోవు చున్నారు, చమటలు పట్టినాయి. కొంచెం దూరం వెళ్ళటానికి ఎంత సమయమో పట్టినది. ఇక వారివలన కాక మనసులో నేను మాష్టారిని తీసుకువెళ్ళుచున్నాను అనుకుంటే "నేనింక సైకిల్ త్రొక్కలేను అనుకున్న వెంటనే మాష్టారు ఇకపద" అన్నారు. వెంటనే మాష్టారు బరువు తగ్గిపోయి తేలికగా అయిపోయి ప్రకాశరావుగారు సైకిల్ సులువుగా త్రొక్కి తర్వగా కార్యక్రమమునకు చేర్చినారు.

వారికే జరిగిన మూడవ అనుభవము:-

ఒకసారి విద్యానగర్ మందిరము వాస్తు చూచుటకు ఒక ఊరిలో



వారివద్దకు ప్రకాశరావుగారిని, మరి యొకరిని పంపినారట, వారిద్దరు అచ్చట పని చూసుకొని రాత్రికి తిరిగి వస్తుంటే బాగా ప్రొద్దుపోయిందట. మధ్యలో ఏదో ఊరి వద్ద ప్రకాశరావు గారు దిగి "మనలను లారీ వాళ్ళు, వాళ్ళంతట వాళ్ళు రమ్మని ఎక్కమంటేనే నేను ఎక్కి వస్తాను. లేకపోతే నేను రాను అని పట్టు పట్టి కూర్చున్నారట. రెండు మూడు లారీలు ఆపకుండా వెళ్ళిపోయాయి, తర్వాత ఒక లారీకి లైటు వైరు ఏదో తెగి వారు దానిని సరిచేసుకునేందుకు ఆపి సరిచేసుకున్నారట, తర్వాత ప్రకాశరావు గారిని చూసి మీరిచ్చట కూర్చున్నారేమిటి ఎచ్చటకు వెళ్ళాలి అని అడిగినారట. వీరు చెపితే, మీరిట్లా కూర్చుంటే ఎవరు మిమ్మల్ని తీసుకువెడతారు, చాల్లెండి ఎక్కండి మేము దింపుతామని వారంతవారు ఎక్కించుకుని విద్యానగర్‌లో దించినారు. అపుడు సమయం '1' గంట అయ్యింది. ఆ సమయంలో శ్రీ మాష్టారింటికి వెళ్ళితే మాష్టారు మెలుకవగానే కూర్చున్నారు. వాళ్ళను చూసి ప్రకాశరావుగారితో దారిలో "చలిలో కూర్చోవటమెందుకు" అని ఏదో ప్రసాదంపెట్టి మంచినీరిచ్చారు. మధ్యలో వారు కూర్చున్నవిషయం మాష్టారు ప్రస్తావించటం చూసి వారు ఆశ్చర్య పడినారు.

శ్రీ మాష్టారితో సి హెచ్. శ్రీనివాసులు రెడ్డి గారి అనుభవాలు:-

1. The Concept of God - అనే పాఠం చెపుతున్నారు మాష్టార్ ఇది దేవునికి సంబందించిన పాఠం. ఈయనకు దేవుడంటే ఇష్టం ఇక ఈ పాఠం ఎంత గమ్మత్తుగా చెపుతారో చూడు అని ప్రక్కవానితో అన్నారు శీను. వెంటనే మాష్టారు శీనును లేపి ఈ పాఠం వ్రాసిన రచయిత తెలివి

తక్కువ వాడని నీ అభిప్రాయము. ఈ రచయిత ఎన్నో గ్రంధాలు వ్రాసి ఉంటారు అందులో ఈ పాతంగల గ్రంధం ఒకటి. ఆ గ్రంధంలో నుండి ఈ భాగం ఎన్నుకొని పాఠ్యాంశం చేశారు. అంతటి వారిని తెలివి తక్కువవాడని ఎలా అనడం. సరే కూర్చోమన్నారు - క్లాసులో నుండి మాష్టారు వస్తుంటే ఏదో చెప్పబోయారు - నీవు చెప్పింది సరిగ్గా ఉందన్నానుగా అని మాటలాడనివ్వలేదు.

2. ఒకసారి కోటలో నాస్థికుల మీటింగ్‌లో పసిపిల్ల బాబా పటం ముందు 10పైసలు దక్షిణ తీయబోతే బాబా పటం నుండి సటకాతో బెదిరించిన సంఘటన చెప్పగా కొందరు సత్సంగం పిల్లలు సర్ వారు - దేవాలయాలలో దోపిడీలు జరుగుతుంటే దేముడు ఎందుకు కాపాడుకోలేదు అని ప్రశ్నిస్తే ఏమి చెబుతారు సర్ అంటే మాష్టారు ఒరేయ్ ఇచ్చట (మాష్టారి హృదయం వైపు చూపుతూ) సంకల్పించనిదే అచ్చట వారికి ఆ ప్రశ్న వస్తుందా? అన్నారట.

3. శ్రీనివాసులురెడ్డిని చదవమనడం పోస్టు గ్రాడ్యుయేషన్ పాస్ చేయమని బాబాను అడగమనడం.

శ్రీనివాసులరెడ్డిగారు డిగ్రీ అయ్యాక ఇంక చదువు మానేసి వ్యవసాయం చేద్దామనుకున్నారట. ఆర్థికంగా తల్లి తండ్రులకు చదివించడం భారమవుతుంది. వ్యవసాయంచేద్దామనుకున్నారట. సెలవులలో శ్రీమాష్టారు వద్దకు వస్తే మాష్టారు ఎమ్.ఎస్‌సి. చదవమని తల్లి తండ్రులను ఇల్లు అమ్ముకొని చెట్టుక్రింద ఉండైనా చదువు కోమన్నారట. తర్వాత చెయ్యి వ్యవసాయం అన్నారట. శ్రీనివాసుల రెడ్డిగారు పట్టు పట్టి తిరుపతి



యూనివర్సిటిలో చేరినారు. ఫస్ట్‌ఇయర్‌లో పరీక్షలముందు ఒకసారి మాష్టారి వద్దకు వస్తే ఎట్లా చదువు చున్నావని అడిగారట. చాలాబాగా చదువుచున్నానండి సిలబస్‌పూర్తి అయిపోయింది అన్నారట. రాత్రి '1' గంట వరకు చదివేవారట. అపుడు మాష్టారు బాబా వద్ద పాసవ్వాలని దండం పెట్టుకోమన్నారట. అదేమిటి అట్లా పెట్టమన్నారు అనుకొని, బాబా వద్ద ఫస్ట్‌క్లాస్ రావాలని దండం పెట్టుకున్నారట. తర్వాత పరీక్షలు వచ్చాయి. మొదటి రెండు రోజులు బాగా వ్రాసినారట. మూడవరోజురాత్రి మనసు మొద్దుబారిపోయినట్లయి ఏమీ చదవాలని అనిపించక, చదవలేక, ఏమీ చెయ్యలేక దిగులుపడి తెల్లవార్లు నిద్రరాలేదు, చదువుకోలేదు. అట్లా అయ్యి తెల్లవారి ఇంక పరీక్ష వ్రాయలేనని ఆరోజు వెళ్ళటం అనవసరమని కూర్చున్నారు. బాబాకేసి చూస్తూ ఇట్లా చేశావేమిటి బాబా అను కుంటూ... ఫస్ట్ బెల్, సెకండు బెల్, థర్డ్ బెల్ వింటూ వెళ్లకూడదని కూర్చున్నారట. దిగులుగా ఇంతలో లోపలినుండి మనసులో 'పో' అని ధ్వని వినిపించి లేచి కాలేజీకి పరుగున వెళ్ళారు. టైమ్ అయిపోయిందని కంగారుపడుతుంటే పరీక్షరూమ్ మార్చినారట. తర్వాత ఎట్లాగో రూమ్‌వెతుక్కొని రూమ్‌లో కెళ్ళి కూర్చొనే సరికి అరగంటయిపోయింది. ఏమి వ్రాసారో వారికే తెలియలేదట. బుర్ర పనిచేయ్యనట్లున్నదట. తర్వాత వారికి ఏమి వ్రాసారో ఏమీ గుర్తు లేదట. పేపర్ ఇచ్చేసి బయటకు వచ్చేశాక అన్నం తినటానికి వెళుతుంటే ఎవరో ఇద్దరు మాట్లాడుకుంటున్నారట. పరీక్ష హాలులో ఎవరో **6412** నెంబరు బదులు **6421** వేసినట్లు ఉన్నారు. మేడమ్ కన్‌ఫ్యూజ్ అవుతోంది కదా అని.

**6412** శ్రీనివాసులు రెడ్డిగారి నెంబరు కావటంతో మళ్ళీ వెనకకు వెళ్ళి వారి పేపరు కోసం ప్రయత్నించి ప్రిన్సిపాల్ గారి వద్ద వారి పేపర్ మరొక్కసారి అడిగి తీసుకొని చూసేసరికి తను తప్పుగా వేసిన **6421**ని మేడమ్ **6412** గా సరి చేసారు. మిగిలిన పరీక్షలు మామూలుగానే వ్రాయగలిగారట.

తర్వాత వాల్యూయేషన్‌కి మాష్టారు తిరుపతి వచ్చేటప్పటికి వీరు మాష్టారుతో తను ఎగ్జామ్స్ సరిగా రాయలేకపోవటం విన్నవించుకుందామని, అంతేకాక మాష్టారు ఇదివరలో "ధ్యానం etc., చేస్తూ ఉంటే మా చదువుకు డిస్టర్బ్ కాదా సార్" అని వీరు అడిగినప్పుడు ఏమి డిస్టర్బ్ కాదు నాది హామీ అనటంతో మాష్టారుతో ఈ మాట గుర్తు చేసి దెబ్బలాట వేసుకుందామనేటట్లు మాష్టారి వద్దకు వెళ్ళారట. ఎప్పుడూ నవ్వుతూ ఎన్నో కుశలప్రశ్నలతో పలకరించే మాష్టారు ఇప్పుడు వీరెళ్ళేటప్పటికి తలతిప్పకుండ న్యూస్‌పేపర్ చదువుకుంటున్నారట. వీరు సర్ ఏమి జరిగిందంటే అంటూ చెపుతుంటే వినకుండా బాత్‌రూమ్ వైపు వెళుతూ నాకంతా తెలుసు "శభాష్ అంతా బాగానే చేసావు, నీకేంకాదు, భయంలేదు" అన్నారట. వీరికి ఏమి అర్ధం కాకున్నా 'ఏమి కాదు, భయంలేదు' అనటంతో సద్దుకున్నారట. రిజల్ట్స్ వచ్చేక చూస్తే వీరికి ఫస్ట్‌క్లాస్; **68%** వచ్చాయట. అలా మాష్టారు త్రికాలజ్ఞలేకాక వారి ప్రారబ్దాన్ని మార్చగల సమర్ధులని ఎరుక పరిచారు.

**4.** వారి హాస్టల్‌లో ఒక తెలివైన, కష్టపడి చదివే ఫ్రెండ్ వుండే వాడట. అతను ఎప్పుడు ఏ లెక్క అడిగినా ఈజీగా క్లియర్‌గా ఎక్స్‌ప్లెయిన్



చేసేవాడట, ఫిజిక్స్‌లో ఏ ఈక్వేషన్ అయినా చెప్పగలిగేవాడట కానీ ఎక్సామ్‌లో మార్కులు మాత్రం ఎప్పుడూ తక్కువ వచ్చేవట. అతను ఒకసారి శ్రీనివాసుల రెడ్డి గారితో తన బాధ చెబితే వీరు మాకు మాష్టారు అనే గురువుగారున్నారు. వారు మమ్మలను రోజూ సాయంత్రం బాబా ఫోటో ముందు కానీ ఎవరికి ఇష్టదైవం ఎవరైతే వారి ఫోటో ముందు కానీ అగరవత్తులు వెలిగించి 10ని॥ ధ్యానం చేసుకోవటం నేర్పారు. నాకు ఎప్పుడూ నా అర్హతకు మించే బాబా మార్కులు ప్రసాదిస్తున్నారు. అంటే అతను కూడా వెంకటేశ్వరస్వామి ఫోటో పెట్టుకుని రోజూ 10ని॥ ధ్యానం చేయటం మొదలుపెట్టాడట. కొన్నాళ్ళకు రెడ్డిగారు వారి ఇంటికి వెళ్ళినప్పుడు ఇతను (రూమ్ మేట్ కూడా అయ్యాడు) శ్రీనివాసులరెడ్డి రూమ్‌మేట్ అయినందున మామూలుగా (కిటికీ దగ్గరగా ఉందని) రెడ్డి గారి మంచంపై పడుకొన్నప్పుడు ఒక కల వచ్చిందట. అందులో ఒక మునీశ్వరుడు పెద్ద గడ్డం ఉన్నవారు వీరి నాలికపై ఏదో వ్రాసారట.

5. సెకండ్ ఇయర్‌లో రెడ్డి గారు చదువలేకపోయినందున, చదివినవి సరిగా జ్ఞాపకం లేనందున బాబాతో, బాబా సరిగా చదవలేక పోయినాను. నాకు **52%** వస్తే $\left(\frac{68+52}{2} = 60\%\right)$ నాకు ఫస్ట్‌క్లాస్ వస్తుంది బాధపడను. నీవు **68%** ఇప్పిస్తే ఫస్ట్‌ఇయర్ పర్సంట్‌కు ఈక్వల్ కనుక సంతోషిస్తాను అని అప్రయత్నంగా చెప్పుకొని ఎక్జామ్ వ్రాసారట. అత్యాశ్చర్యంగా **68%** కు ఒక్క మార్కు తక్కువ ఎక్కువ కాకుండా వచ్చిందట. బాబా తనతో "నీవు సంతోషపడరా, పో! బాధపడవలసిన కర్మేమి?" అన్నట్లు ఉంది అంటారు.

6. మాష్టారితో పరిచయమైన కొత్తలో మాష్టారిని మాటల్లో తికమక పెట్టాలనే ఉద్దేశ్యముతో ఒకసారి మాష్టారు కాలేజి నుండి వారి రూమ్ కు వెళుతుంటే 'సార్ కోరికలు ఉండకూడదంటారు కదా?' అని అడిగారట. అప్పుడు మాష్టారు వెంటనే 'ఎందుకు ఉండకూడదోయ్! పందికొక్కుకు కోరికలుండవు అని అన్నారట. కోరికలు దుఃఖ కారణము etc,. ఇదివరలో వీరు చదివి వుండటంతో మాష్టారు కోరికలు ఉండకూడదంటారేమో దాన్ని పట్టుకొని మరి మీరు జాబ్ ఎందుకు చేస్తున్నారు. etc,. అడుగుదామనుకున్నారట కానీ మాష్టారి ఆన్సర్ వీరి నోరు కట్టేసింది అంటారు. కొంచెం ముందుకు వెళ్ళి మాష్టారు వెనక్కి తిరిగి వీరి వైపు చూస్తూ 'నీవు నాజ్ఞానాన్ని అంచనా వేయలేవు' అన్నారట. దానికి వీరు ఎందుకు అంచనా వేయలేను. ఇచ్చటినుండి మీ యింటికి దూరం ఫర్లాంగులలో, ఇంకా దూర ప్రదేశాలు కిలో మీటర్లలో, గ్రహాల మధ్య దూరం 'కాంతిసంవత్సరం' అనే కొలతతో (అంటే అప్పటికి ఇంగ్లీషు లెక్చరర్ అయిన భరద్వాజ మాష్టారికి 'కాంతి సంవత్సరం' తెలియదని వీరి భావం. అందుకే దాన్ని ఎక్స్ప్లెయిన్ కూడా చేసారట). అలా కొలుస్తారు కదా సార్. అలాగే మీ జ్ఞానం ఎంత పెద్దదైతే అంత పెద్ద కొలబద్దతో కొలుస్తాను అన్నారట. మాష్టారు ఇల్లు రావటంతో లోపలికి వెళ్ళబోతూ "అలా జరగాలంటే 'నేను' చావాలి" అంటూ వెళ్ళారట. తిరిగి గళ్ళలుంగీ, బనీను తో బయటకు వచ్చారు. ఆ డ్రస్‌లో వారిని చూడటం అదే ఫస్ట్ టైం. అప్పటి నుండి అప్పుడప్పుడు వారింటికి వెళుతుండే వాడిని అన్నారు.



7. M.Sc తరువాత జాబ్‌కోసం try చేస్తూ హైదరాబాదు ఇంటర్వ్యూకని వెళ్ళబోతూ మాష్టారిని దర్శిస్తే మాష్టారు ఎచ్చటికి అని వివరాలు అడిగి "జాబ్ వస్తే షిరిడీ వస్తానని బాబాకు చెప్పుకో" అన్నారట. అంతటితో వారికి జాబ్ ప్రసాదించారన్న విశ్వాసం, ఆనందం కల్గటం, వారు బాబాతో అలా చెప్పుకొని వెళ్ళగానే ఆ జాబ్ రావటం జరిగాయట.

8. మాష్టారు ఒకసారి కాలేజిలో యూనిట్ టెస్ట్ లాంటి ఎక్జామ్ నిర్వహించ బోతూ ఈ ఎక్జామ్‌లో ఫస్ట్ వచ్చిన వాళ్ళకు ప్రైజ్ ఇస్తానన్నారట ఎక్జామ్స్ అయ్యాక కొన్ని రోజులైనా పేపర్లు దిద్ది ఇవ్వకపోతే రెడ్డి గారు మాష్టారినడిగితే "ఇస్తానోయ్ తొందరేముంది" అన్నారట. రెండు, మూడు నెలల తరువాత పేపర్స్ తీసుకొచ్చి అందరికీ తలా ఒకటి ఇచ్చి వారి చేత దిద్దిస్తున్నారట. వెంకటనాయుడు అనే ఒక అబ్బాయి ఇంటలిజెంట్ అబ్బాయే అయినా వెంకటస్వామి అనే అబ్బాయితో ఒరేయ్ నా పేపర్ నీకు వచ్చింది కదా! అన్నీ కరెక్ట్ వేసి మార్కులు ఇవ్వరా అని అడుగుతున్నాడట. తరువాత మార్కులు కౌంట్ చేసి వెంకట నాయుడు School First in The Class అన్నారట. కానీ ప్రైజ్ మాత్రం ఇవ్వలేదట. B.Sc మొత్తం అయిందట. మాష్టారు మాట తప్పారు కదా? వారిని అడుగుదాం అని రెడ్డిగారి కుండేదట. Results వచ్చాక వారు అది అడుగుదామనీ, తన Results చెబుదామనీ మాష్టారి వద్దకు వెళితే కరెక్ట్‌గా అదే టైమ్‌కు చాలా అరుదుగా కానీ మాష్టారి వద్దకురాని వెంకట నాయుడు ఊలు టోపీ పెట్టుకొని వచ్చాడట. మాష్టారు అతనితో అదేమిటోయ్ అంటే తాను తిరుపతిలో గుండు చేయించుకున్నానని అందుచే టోపీ పెట్టుకున్నాననీ

చెప్పాడట. దానికి మాష్టారు దేముని ప్రీతికై గుండుచేయించుకున్నప్పుడు దానినలా అవమానంగా భావించి ఇంకొక fashion తో దాచుకోకూడదు అన్న భావం వచ్చేట్లు చెబితే అతడు మీరు తీసేయమంటే టోపీ తీసేస్తాను సార్ అని తీసేశాడట. తరువాత అతను సార్ మీరు ఒకప్పుడు ఎగ్జామ్‌లో ఫస్ట్ వచ్చిన వాళ్ళకు ప్రైజ్ ఇస్తానని చెప్పి కూడా ఫస్ట్ వచ్చిన నాకు ఇవ్వలేదు సార్ అని అడిగాడట. దానికి నీకు ఫైనల్‌లో ఎన్ని మార్కులు వచ్చాయి అని అడిగారు. డిస్టింక్షన్ వచ్చింది సార్ (70% కంటే ఎక్కువ) అంటే అదేనోయ్ నేనిచ్చిన ప్రైజ్ అనటంతో సర్వులకూ కర్మఫలాన్ని ప్రసాదించే కర్మఫల ప్రదాత తానే అంటారు మాష్టారు. అంతేకాక శ్రీనివాసుల రెడ్డిగారు అడుగుదామనుకున్న శంకను వెంకయ్య నాయుడు ద్వారానే అడిగించి మరీ నివృత్తి చేసిన సర్వ, విశ్వ ప్రేరణాధికారి మాష్టారు అంటారు.

9. ఒక రోజు ఉన్నట్లుండి రెడ్డిగారికి మాష్టారి వద్దకు వెళ్ళాలని బలంగా అనిపించటంతో పరుగెత్తుకొని వెళ్ళేసరికి సత్సంగం జరుగుతోందట. వారు చివర కూర్చోక నలుగురైదుగురిని దాటుకుంటు పోయి కిటికీ ప్రక్క కూర్చున్నారట. కిటికీలోంచి చంద్రుడు పైకి రావటం ఎంతో అందంగా కనిపించటంతో పరిస్థితులను మరచి మాష్టారితో చంద్రుడు ఎంత అందంగా పైకి వస్తున్నాడు చూడండి సార్ అన్నారట. మాష్టారు అదా నీకు తెలియదా! ఈ రోజు గురు పూర్ణిమ కదా! అన్నారట. అలా గురుపూర్ణిమనాడు అకస్మాత్తుగా ప్రేరణపెట్టి రప్పించటమేగాక ఆ రోజు గురు పూర్ణిమ అని ఎరుకపరిచారు, చిత్రమైన రీతిలో ఎన్నో పరిస్థితులను కల్పించి అంటారు.



కొన్ని రోజులకు జి.వి.రావ్ గారు, ఢిల్లీ వారికి పరిచయమై మాట్లాడినపుడు మాష్టారి వివిధ ఫోటోలు పంపమని కోరగా వారు పంపుతాననటం, కరెక్టుగా next గురుపూర్ణిమకు red envelop గల కవరులో ఆ 21 ఫోటోలు రాగా వీరు red envelop చూచి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ ఏమో అని భయపడటం కానీ తీసి చూస్తే మాష్టారు కనిపించటం చెప్పారు. అంతకు ముందు, మాష్టారు సమాధి కాని క్రితమే, వీరు సాయి సన్నిధి ముందు మాట చదివి అందులో మాష్టారు స్థానము "మీరు ఉన్న చోటు" అని వ్రాయటంతో ఆశ్చర్యపోయి మాష్టారిని దాని గూర్చి అడుగుదామనుకున్నారట. గురుపూర్ణిమికి ఆ ఫోటోల రూపంలో మాష్టారు రావటంతో వారికి ఆ స్థానము మీరున్న చోటు గుర్తుకు వచ్చి మాష్టారు మనం ఉన్న చోట ఉన్నది నిజమే అని అనుభూతి పొందారట.

Next గురుపూర్ణిమికి ముందు గురుపూర్ణిమి టైమ్‌లో భయపడినట్లు, నిజంగానే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్, Red envelop లో వాచ్చాయట. ఇలా ప్రతి గురుపూర్ణిమ రోజు ఏదో ఒక స్పెషల్ తో గుర్తు చేస్తుంటారు మాష్టారు అంటారు.

10. మాష్టారిని వీరు ఒకసారి "మన వేదఋషులు ఏదిపొందాలని చెప్పారో, ఏది పొందామని చెప్పారో దానిని మీరు పొందారా?" అంటే వెంటనే గుండెలపై చేయి వేసుకొని "పొందే బయటకు వచ్చాను" అన్నారట.

శ్రీమాష్టారితో హరిబాబు

హరిబాబు గారికి భరద్వాజ మాష్టారితో గల అనుభవాలు:-

1. వాళ్ళ నాన్న గారికి అప్పట్లో మాష్టారిపై ఉండే మంచి regard వల్ల వీరికి మాష్టారిపై పూజ్యభావం ఏర్పడటం, మాష్టారి వద్దకు (దగ్గరిలోనే ఉన్న మెట్టు అనే వారి గ్రామం నుండి) వెళ్ళడం జరుగుతుండేది.

2. వీరికి ఒకరోజు రోజూ చేసేటట్లు బాబా (Photo) కు కాక మాష్టారి (Photo) కి పూజ చేయాలనిపించి చేశారట. చేసిన రోజు మధ్యాహ్నం వీరి నాన్నగారు నీకు మాష్టారు ప్రసాదం ఇమ్మన్నారు అని ప్రసాదం ఇచ్చారట వీరికి ఇచ్చుటి పూజను మాష్టారు స్వీకరించే మామూలుగా ఎవరికీ పేరుపెట్టి ప్రత్యేకంగా ప్రసాదం ఇవ్వని మాష్టారు, ఈ రోజు తన కలా ఇచ్చారని ఆశ్చర్యము, ఆనందము కలిగాయుట.

అలాగే మరొకరోజు కూడా మాష్టారికి పూజ చేయాలనిపించి చేయటం మాష్టారు ప్రత్యేకంగా పేరు చెప్పి వారికే ప్రసాదం పంపడం జరిగిందట

మరొకసారి వీరి ఊరి మందిరంలో బాబాకి (గురుపూర్ణిమకో లేక విజయదశమికో) సామూహిక పూజ చేస్తుంటే వీరికి మందిరంలోనే ప్రక్కగదిలో కూర్చుని మాష్టారి Photo కు పూజ చేయాలనిపించి చేసారట. పూజ పూర్తి అయ్యేందుకు కొంతముందే మాష్టారు దానిమ్మపండు ప్రసాదం పంపి అచ్చట పూజలో పాల్గొన్న వారందరికీ అచ్చటి ప్రసాదం పంచక ముందే దీనిని పంచ మన్నారట.



మాష్టారి సమాధి అనంతరం మరల ఒకరోజు మాష్టారి Photo కు పూజ చేస్తూ ఇప్పుడు మాష్టారు ప్రసాదం ఎలాపంపుతారో చూడాలి అనుకుంటే పూజఅయి వీరు విద్యానగర్ వెళితే అచట వీరికి ఎవరో (పరిచయస్తులే) వచ్చి రెండు మాష్టారి Photos ఇచ్చారట. అట్లా సమాధి అనంతరం కూడా ముందులానే పూజ స్వీకరిస్తున్నాని తను సర్వ సాక్షిగా, సర్వ ప్రేరణాధికారిగా పనిచేస్తున్నాని నిదర్శనమిచ్చారు.

3. మాష్టారు మన కర్తవ్య నిర్వహణకు ఎంత ప్రాముఖ్యం ఇస్తారో వీరికి చేసిన ఒక సూచన ద్వారా తెలిపారు. ఒక ఆదివారం మాష్టారి వద్ద ఉండి సోమవారం ఉదయం కూడా ఉండి మధ్యాహ్నానికి వెళ్ళవచ్చనే దృష్టిలో వీరు సోమవారం ఉదయం చేయవలసిది కొంత శనివారమే చేసి వారి ఆఫీస్ లోని వారితో తాను సోమవారం ఉదయం రానని చెప్పి మరీ వచ్చారట. సోమవారం ఉదయం **8.45**ని॥లకు మాష్టారు వీరితో టైం ఎంత అయింది అని అడిగి మీ ఆఫీస్ ఎన్నింటికి అని అడిగి **9** గం॥లకో (లేక **10**గం॥) అంటే మరి ఇంకా బయలుదేరలేదే అని అడిగి వీరు మధ్యాహ్నం వెళతానంటేను, వారి ఆఫీస్‌లో వారికి చెప్పానన్నా ఒప్పుకోక మన కర్తవ్యం (స్వధర్మం) మనం క్షుణ్ణంగా చేయాలనీ, ఆఫీస్‌లో వారికి నీపై మంచి అభిప్రాయం ఉంటే దానిని నిలబెట్టుకోవాలి కానీ ఇలా వాడుకోకూడదు అని బయలుదేరే వరకు ఊరుకోక పంపించారట.

4. ఒకసారి మాష్టారి సన్నిధిలో వీరు మాష్టారు సమాధి అయ్యాక నా గతి ఏమిటి అనుకుంటుంటే మాష్టారు వీరి వైపు తిరిగి "నేను" పోతే తెలుస్తుంది అన్నారట. అచ్చటే ఉన్న ఒక ఫ్రెండ్ అది కాదు సార్ నాభావం

అంటే అందులో సగమే నీకు వర్తిస్తుంది అంటున్నారట.

5. ఒకరు సుధీంద్ర బాబు గారి వద్ద కు వెళ్ళినప్పుడు సుధీంద్ర బాబు గారు ఎవరు పంపితే వచ్చావు? అంటే భరద్వాజ మాష్టారు వ్రాసిన చరిత్రలో చూచి (పంపితే) వచ్చాను అనగా వారు భరద్వాజ మాష్టారి గూర్చి 'ఆయన చరిత్ర ఆయనే వ్రాసుకోగల వారు' అని ప్రసంశించారట.

6. ఒకరోజు వారు సాయి లీలామృతం చదువుతుండగా ఎందుకో బాగా మాష్టారి వద్దకు వెళ్ళాలనే ప్రేరణ కల్గి ఇంక ఉండబట్టలేక ఆ సాయి లీలామృతం అలా rack లోకి విసిరి షర్ట్ వేసుకొని త్వరత్వరగా నడచుకుంటూ విద్యానగర్ లో మాష్టారి వద్దకు (మెట్టునుండి) నడవటం మొదలుపెట్టారట. దారిలో ఒక సాయి మాష్టారి భక్తులు కనబడి "ఈ రోజు" అంటే విద్యానగర్‌లో మందిరానికి స్లాబ్ పోస్తున్నారని విని ఎంతో ఆనందంతో shortcut లో త్వరగా అచ్చటకు చేరి ఆ సేవ చేయించుటకే మాష్టారు అలా ప్రేరేపించి పిలిపించారని గుర్తించి ఆశ్చర్యానందం పొందారు.

7. ఒకసారి వీరు శ్రీవెంకయ్యస్వామి వారి సన్నిధిలో కూర్చొని ధ్యానం చేసుకుంటాననీ పాద నమస్కారాలు గట్రా పేరుతో స్వామిని disturb చేయననీ తులసమ్మ గారికి నచ్చజెప్పి స్వామి సన్నిధిలో కూర్చుంటే గురవయ్య గారు వచ్చి బయటకు వెళ్ళమనగా మరల నచ్చజెబుతుంటే నీవు వచ్చేది తెలుసులేయ్యా కూర్చో అన్నారట. ఎట్లా తెలుసు అంటే next time చెబుతానని ఆ next time ఇలా చెప్పారట. భరద్వాజ గారు కానీ వారి సంభందీకులు కానీ వస్తుంటే స్వామి వారు "చిన్న దేముడు" అని అంటారు అన్నారట.



స్వామి సమాధి మందిర నిర్మాణానికి కావలసిన సేవ చేసే భాగ్యం పొందుటకై స్లాబ్ పోసేటప్పుడు వీరికి ముందుగా తెలియజేయమని స్వామి భక్తులు, గొలగమూడిలో ఉండే వారు అయిన వెంకట్రావు గారిని అడిగితే వారు ఒక తేది చెప్పారటగానీ అప్పుడు పని జరుగలేదుట.

తరువాత కొంత కాలానికి విద్యానగర్ భక్తులు నెల్లూరు వచ్చి ముందుగా అనుకోకపోయినా గొలగమూడి వెళ్ళాలని ధృడంగా అనిపించి గొలగమూడి వచ్చేసరికి అప్పుడు correct గా slab పోసే పని జరుగుతుండటం అందులో వీరు పాల్గొనే అవకాశం రావటం జరిగిందట. హృదయ పూర్వకంగా స్వామికి ఆ సేవ చేద్దామనుకున్నందుకు గాను ఎవరూ తెలుపకున్నా, స్వామే ప్రేరేపించి ఆసేవ చేయించుకున్నారు. (ఒకసారి వీరు బస్సు లో ఎక్కి బాబాను స్మరిస్తూకూడా మధ్యమధ్యలో 4,5 సార్లు సిగిరెట్ కాల్చారట ఆ తరువాత వెనకాల నుండి శంకరాచార్యుల వారి గూర్చి ఎవరిదో మాట వినబడి చూస్తే మాష్టారు ఉంటే ఆశ్చర్యపోయారట.) ఇంకోసారి ప్రెస్‌లో పనిచేస్తూ సిగిరెట్ కాలుస్తుండగా మాష్టారు వస్తే వెంటనే దానిని వీరు ఆర్పివేస్తుంటే ఆర్పటమెందుకు కాల్చుఅంటున్నారట. అంతే కాక ఈ మధ్య సిగిరెట్‌లు ఎక్కువ అవుతున్నాయి అన్నారట.


ఒకరోజు వారు టీ త్రాగే ప్రతి సారి మాష్టారికి సమర్పిస్తున్నట్లు భావిస్తూ త్రాగారట. తరువాత వీరు మాష్టారి వద్దకు వెళ్ళినప్పుడు ఆ రోజు గుర్తుచేసి ఆరోజు నాకు టీలు ఎక్కువయ్యాయి అన్నారట! అంటే మనం అర్పించే ప్రతిదీ వారు స్వీకరిస్తున్నారన్న నిదర్శనం ఇచ్చారు.

సూళ్ళూరు పేట
వారి అన్నయ్య గార్కి సంతానం లేక ఎందరికో డాక్టర్లుకు చూపి వైద్య ప్రయత్నములు చేయించినా ఫలితం లేకపోయింది. ఒక జ్యోతిష్యుడు సంతాన ప్రాప్తిలేదని కూడా చెప్పినారు. వారు ఒకసారి శ్రీమాష్టారుకు పాదపూజ జరుగుచున్నప్పుడు పాల్గొని ఆ పాదతీర్ధం వారి భార్యగారి చేత త్రాగించారట. తర్వాత ఇంటికి చేరిన నెలకు వారు గర్భవతి అయినారట. వారికి ఒక పాప కలిగినారు. ఆ తర్వాత ఇక పిల్లలు లేరట.

# మృత్యువుపై ఘన విజయము

2వ ముద్రణ కొత్తకాపీలతో

**పూజ్య ఆచార్య శ్రీ భరద్వాజ గారు**



కాపీలకు :-
యమ్.యమ్. చంద్రబాబు
ద్వారకా టెక్స్‌టైల్స్, కచేరి వీధి,
సూళ్ళూరుపేట, నెల్లూరు జిల్లా - 524121